భోగి మంటలు..రంగవల్లులు

ముగ్గుల్లు...ముంగిళ్లు...సరదాలు - భోగి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు

ఎర్రగడ్డ, జనవరి 13: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని డీవైఎఫ్ఐ జూబ్లీహిల్స్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో బోరబండ వీకర్‌సెక్షన్ లోని సంతోష్‌నగర్ బస్తీలో మహిళలకు సోమవారం ముగ్గుల పోటీ నిర్వహించారు. సంతోష్‌నగర్‌తో పాటు పరిసర బస్తీలకు చెందిన మహిళలు ఈ పోటీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. జోన్ కమిటీ కార్యదర్శి దాదిమల్ల కృష్ణ మాట్లాడుతూ పండుగ ఏదైనా మత సామరస్యాన్ని చాటే విధంగా జరుపుకోవాలని పేర్కొన్నారు. ప్రకటించిన యూత్ డిక్లరేషన్ అమలుపర్చాలని, నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. డీవైఎఫ్ఐ ప్రతినిధులు ఆనంద్, శ్రీను, విష్ణు, శివ, శైలజ, ఇంద్ర, నీతూ, రాధ, భారతి, సీపీఎం నాయకుడు సాయిశేషగిరిరావు, సంతోష్‌నగర్ బస్తీ అధ్యక్షుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా భోగి పండుగ

మైలార్‌దేవ్‌పల్లి: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సంబురాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మహిళలు ఇంటి ముందు పెద్ద ఎత్తున రంగు రంగుల ముగ్గులను వేసి సంక్రాంతికి స్వాగతం పలికారు. మొదటి రోజు భోగి సందర్భంగా ప్రజలు తమ ఇళ్లల్లోని పాత వస్తువులను తీసుకొచ్చి భోగి మంటలు వేశారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని బస్తీల్లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేష్ ఆధ్వర్యంలో భోగి మంటలు వేశారు. భోగి పండుగ సందర్భంగా ప్రజల జీవితంలో బాధలు దహనమై ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆయన కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.వెంకటయ్య ముదిరాజ్, మహేష్ ముదిరాజ్, రమేష్ ముదిరాజ్, రాయుడు, అశోక్‌కుమార్, యాదగిరి, నరేష్ ముదిరాజ్, శ్రీను ముదిరాజ్, పద్మ, రాజేశ్వరి, బీఆర్ఎస్ మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నారాయణగూడ వైఎంసీ చౌరస్తాలో..

హిమాయత్‌నగర్: సమాజంలోని ప్రతి పౌరుడు ఆరోగ్యకరమైన జీవనం సాగించేందుకు నిత్యం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అంబర్‌పేట సర్కిల్ -16 ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమలత సూచించారు. భోగి పర్వదినం సందర్భంగా నారాయణగూడ వైఎంసీ చౌరస్తాలో జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య మహిళా కార్మికులు తెల్లవారు జామునే రోడ్లను శుభ్రం చేయడంతో పాటు ముగ్గులు వేసి భోగి వేడుకలను జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య విభాగం ఎస్ఎస్ తిరుపతి నాయక్, ఎస్ఎఫ్ఎలు సీహెచ్. సోమయ్య, ఎం. శ్రీనివాస్,సతీష్ చంద్ర,మధు, కె.శ్రీనివాస్, కామేష్, అర్జున్, శ్రీధర్‌తో పాటు పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

నారాయణగూడలో భోగి సంబురాల్లో జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది

ఎర్రగడ్డ: ముగ్గుల పోటీల్లో పాల్గొని ముగ్గులు వేస్తున్న సంతోష్‌నగర్ బస్తీ మహిళలు



రహ్మత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి కార్యాలయంలో చిన్నారులకు భోగి పండ్లు పోసి ఆశీర్వదిస్తున్న కార్పొరేటర్ తదితరులు

అత్తాపూర్ లక్ష్మీరాం హారన్ అపార్ట్‌మెంట్ ఆవరణలో భోగి మంటలు..

ఐఐఎంసీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా

ఖైరతాబాద్, జనవరి 13 : ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ కళాశాల (ఐఐఎంసీ)కి స్వయం ప్రతిపత్తి హోదా దక్కింది. 1973 స్థాపించిన ఐఐఎంసీ అంచలంచెలుగా ఎదుగుతూ నేడు 1700 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని ప్రిన్సిపాల్ కూర రఘువీర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీకాం (హానర్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, బిజినెస్ అనాలిటిక్స్), బీఎస్సీ (డేటా సైన్స్), బీబీఏ కోర్సులను అందిస్తోందన్నారు.

ఈ సంస్థ 2023లో 3వ సైకిల్‌లో 3.27 స్కోర్ సాధించి న్యాక్ ద్వారా ఏ ప్లస్ గ్రేడ్ సాధించిందన్నారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ 2025-26 విద్యాసంవత్సరం నుంచి పది సంవత్సరాల పాటు స్వయం ప్రతిపత్తి హోదాలో సేవలందిస్తుందని తెలిపారు. ఈ మేరకు కళాశాల చైర్మన్ వంగపల్లి విశ్వనాథం, కార్యదర్శి చల్లా ప్రసన్న కుమార్‌లు కళాశాల యాజమాన్యం, విద్యార్థులను అభినందించారు.

శిల్పారామంలో సంక్రాంతి సంబురాలు

కొండాపూర్, జనవరి 13 : మాదాపూర్‌లోని శిల్పారామంలో సంక్రాంతి సంబురాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. భోగిని పురస్కరించుకుని చిన్నారులకు భోగి పళ్ల ఉత్సవాన్ని నిర్వహించారు.

సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా తాడేపల్లి సుబ్బలక్ష్మి బృందం సంక్రాంతి పాటలతో అలరించగా, రేణుక ప్రభాకర్ బృందం గోదా కల్యాణం కూచిపూడి నృత్య రూపకంలో ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

18న శిల్ప కళావేదికలో భయాన్

తెలుగు యూనివర్సిటీ, జనవరి 13 : గజల్స్ కథక్‌ల అరుదైన కలయికతో కూడిన ప్రదర్శన జనవరి 18న సాయంత్రం 7గంటలకు భయాన్-ఏ-గాలిబ్ శీర్షికతో కల్యాణ్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ట్రస్టు సీఈఓ డాక్టర్ కౌస్తుబ్ ధమాల్ వెల్లడించారు. రెడ్‌హిల్స్‌లో గల ఫ్యాప్సీలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో షో నిర్మాత సుధాంశు మణితో కలిసి కౌస్తుబ్ ధమాల్ వివరాలను వెల్లడించారు. కొత్త తరానికి సంగీత కచేరీల ద్వారా గజల్స్‌ను చేరువచేయాలనే లక్ష్యం తో ఈ కార్యక్రమాన్ని హైదరాబాద్ వేదికగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మనోహరమైన గజల్ పద్యాలు మంత్రముగ్ధులను చేసే కథక్ నృత్యంతో ఉర్దూ సాహిత్యంలో అత్యంత ప్రసిద్ధ వ్యక్తుల కవిత్వం ఈ ప్రదర్శనలో జీవం పోసుకుని ఆహూతులను అలరించనుందని వివరించారు. సీనియర్ సిటిజన్స్‌కు ప్రవేశం ఉచితమని తెలిపారు. ఇతరులకు నామమాత్రపు రుసుముతో ప్రవేశం కలిపిస్తున్నట్టు, టికెట్ల కోసం ఆన్‌లైన్‌లో www.bookmyshow.com లో బుక్ చేసుకోవచ్చని సూచించారు.

జాంద్ర సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

గ్రేటర్ హైదరాబాద్ మహిళా జాంద్ర సంఘం ఆధ్వర్యంలో సోమవారం సంక్రాంతి సంబురాలు ఘనంగా నిర్వహించారు. పద్మశాలిపురం శ్రీ భవానీ మాత దేవాలయంలో రంగోళి ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ హాజరయ్యారు. ముగ్గుల పోటీల్లో దాదాపు 52 మంది మహిళలు పాల్గొని రంగు రంగుల ముగ్గులు అందంగా ముస్తాబు చేశారు. ఉత్తమ ముగ్గులను ఎంపిక చేసి ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్‌దాస్‌గౌడ్, ప్రేమ్‌గౌడ్, తెల్లాపూర్ కార్పొరేటర్ పావని, ఎం.వెంకటేష్, జి.వెంకటేష్, కాశీగారి యాదగిరి అర్గనైజర్లు పొట్ల రామస్వామి, బుగిడి అనూప్, ఎల్లప్ప, శ్రీనివాస్, మంజుల, రేవతి, భారతి, లక్ష్మి, స్వప్న, బాలకృష్ణ, కిషన్ పాల్గొన్నారు. - మైలార్‌దేవ్‌పల్లి,

మైలార్‌దేవ్‌పల్లిలో భోగి పండుగ సందర్భంగా భోగి మంటల్లో పాల్గొన్న బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎస్.వెంకటేష్ తదితరులు

అండగా ఉంటాం..

విహార యాత్రకు వెళ్లి కొండపోచమ్మ జలాశయంలో దుర్మరణం చెందిన అత్తాపూర్ ఎన్టీనగర్ ప్రాంతానికి చెందిన సాహిల్ దీపక్ సుతార్ కుటుంబాన్ని మాజీ ఎంపీ వి.హనుమంతరావు సోమవారం పరామర్శించారు. వారి కుటుంభానికి ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభుత్వం తరపున తామంతా అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. ప్రభుత్వం తరపున సహాయ సహకారాలు అందిస్తామని అధైర్యపడవద్దు అంటూ వి.హనుమంతరావు ధైర్యం చెప్పారు. అనంతరం సాహిల్ దీపక్ సుతార్ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. - మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 13:

గుర్తు తెలియని వృద్ధుడు మృతి

హిమాయత్‌నగర్,జనవరి13: గుర్తు తెలియని ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన సోమవారం నారాయణగూడ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై షఫీ తెలిపిన వివరాల ప్రకారం నారాయణగూడలోని శాంతి థియేటర్ ముందు ఉన్న బస్‌స్టాప్‌లో ఫుట్‌పాత్‌పై గుర్తు తెలియని ఓ వృద్ధుడు (65) పడి ఉన్నట్లు స్థానికులు గుర్తించి 100కు సమాచారం అందజేశారు.దీంతో ఘటనా స్థలానికి నారాయణగూడ పోలీసులు చేరుకుని 108కు సమాచారం ఇవ్వగా వైద్య సిబ్బంది వచ్చి ఆ వృద్ధుడిని పరీక్షించగా అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానలోని మార్చురీకి తరలించారు.సంబంధికులు ఎవరైనా ఉంటే 040- 27852579 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.ఎస్సై షఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం

తలారి రేణుక (ఫైల్)

ఖైరతాబాద్, జనవరి 13 : షాపింగ్ కోసం వెళ్తున్నానని చెప్పి ఓ యువతి కనిపించకుండా పోయింది. ఈ ఘటన ఖైరతాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఏఎస్ఐ శ్రీరాములు తెలిపిన వివరాల ప్రకారం... మహాభారత్‌నగర్‌కు చెందిన తలారి విజయలక్ష్మి, ఎల్లయ్య దంపతులకు ఓ కొడుకు, కుమార్తె తలారి రేణుకా దేవి (22) ఉన్నారు. ఈ నెల 12న షాపునకు వెళ్లి బిస్కెట్లు కొనుక్కొని వస్తానని చెప్పి బయటకు వెళ్లి సాయంత్రం వరకు కూడా తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ కుమార్తెతో చంద్రశేఖర్ అనే వ్యక్తి తరచూ వివిధ ఫోన్ నంబర్లతో ఫోన్‌లో మాట్లాడుతుండే వాడని, అతనిపై అనుమానం ఉన్నట్లు తల్లి విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

'డబుల్' ఇండ్లల్లో మౌలిక వసతులు కల్పిస్తాం

దుండిగల్,జనవరి13 : నిజాంపేట్, బాచుపల్లిలోని డబుల్ బెడ్రూం ఇండ్లల్లో మౌలిక వసతులను కల్పిస్తామని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ తెలిపారు. సోమవారం పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాచుపల్లి, నిజాంపేట్ డబుల్ బెడ్రూం ఇండ్ల సముదాయాల లబ్ధిదారులు ఎమ్మెల్యే కెపి వివేకానంద్‌ను మర్యాద పూర్వకంగా కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బాచుపల్లి, నిజాంపేట్ డబుల్ బెడ్రూం ఇండ్ల సముదాయాల వద్ద నెలకొన్న పలు సమస్యలను వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని అన్ని డబుల్ బెడ్రూం ఇండ్ల సముదాయాల వద్ద అధికారులతో సమావేశాలు నిర్వహించి, మౌలిక వసతులను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులు ఇండ్లల్లోకి చేరుకునే విధంగా సౌకర్యాలు కల్పిస్తున్నామని ఇందులో భాగంగానే ఇప్పటికే బహదూర్‌పల్లి, డీ.పోచంపల్లి,దుండిగల్ డబుల్ బెడ్రూం ఇండ్లలోని లబ్ధిదారులకు అన్ని వసతులతోపాటు బస్సు సౌకర్యాన్ని కల్పించామని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి బాచుపల్లి, నిజాంపేట్ డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులకు మౌలిక వసతుల కల్పనతో పాటు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ కార్పొరేటర్ బాలాజీనాయక్, డబుల్ బెడ్రూం లబ్ధిదారులు పాల్గొన్నారు.



డబుల్‌బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులతో సమావేశమైన ఎమ్మెల్యే వివేకానంద్,కార్పొరేటర్ బాలాజీనాయక్, పాల్గొన్న లబ్ధిదారులు

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 13: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాటేదాన్‌లోని కాటన్ బాక్స్ కంపెనీ పక్కన ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందిందన్నారు. వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా సుమారు 45-50 సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి తల రెండు భాగాలై మరణించి ఉన్నాడన్నారు. గుర్తు తెలియని వాహనం కింద నిద్రిస్తుండగా డ్రైవర్ అతడిని చూసుకోకుండా వాహనాన్ని తీయడంతో ఆ వ్యక్తి మరణించి ఉండవచ్చునని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అతడు స్థానికంగా భిక్షాటన చేస్తూ ఉండేవాడని విచారణలో తేలిందన్నారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న మిసెస్ ఇండియా గ్రాండ్ ఫినాలె..

మహిళల్లో క్యాన్సర్, ఇతర అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన మిసెస్ ఇండియా ఫ్యాషన్ షో ఆకట్టుకున్నది. మమతా త్రివేది ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన ఈ ఫ్యాషన్ షోలో తెలుగు రాష్ట్రాల నుంచి ఎంతో మంది మహిళలు పాల్గొన్నారు. ర్యాంప్ వాక్ చేస్తూ అబ్బురపరిచారు. మూడు కేటగిరీల్లో 70 మంది మహిళలు బరిలో నిలిచారు. చేనేత కార్మికులకు చేయూతనిచ్చేలా నిర్వహించిన కార్యక్రమానికి మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళలకు ఫ్యాషన్ షో కిరీటం పెట్టి సత్కరించారు. కాగా, తెలంగాణ విజేతగా లక్ష్మీ తేజ, ఏపీ నుంచి పులిపాటి విశాలక్ష్మి నిలిచి మిసెస్ ఇండియా కిరీటాన్ని సొంతం చేసుకున్నారు. - సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ

ఆరంఘర్ చౌరస్తాలో... సొంత ఊర్లకు వెళ్లడానికి సరిపడా బస్సులు లేక గంటల తరబడి బస్సుల కోసం పడిగాపులు కాస్తున్న ప్రయాణికులు.

బహిరంగ ప్రకటన

సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా నా క్లయింటు కరెస్పాండెంట్, పయోనీర్ ఎడ్యుకేషన్ సొసైటీ, టిఎన్‌జిఓస్ కాలని, మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్, రంగారెడ్డి జిల్లా, తెలంగాణవారిచే ప్రాతినిధ్యం వహించబడుతున్న ఎన్.ప్రమోద్ రెడ్డి S/o మల్లారెడ్డి, వయస్సు: దాదాపు 53 సం.లు, వృత్తి: వ్యాపారం, నివాసం: ప్లాట్ నెం.105, ఇంటి నెం.8-12-105,TNGOS కాలనీ, మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్‌వారు స్పెషల్ పవర్ ఆఫ్ అటార్నీ (ఎస్‌పిఎ) హోల్డరు, ఆర్.పెంటయ్య, నివాసం: ఇంటి నెం.167/EWSH, న్యూ సంతోషనగర్ కాలని, సైదాబాద్, హైదరాబాద్‌వారిచే ప్రాతినిధ్యం వహించబడుతున్న, యుఎస్ఎలో నివసిస్తున్న డా. ఆర్. హైమవతి భర్త పి.శ్రీకాంత్ మీద ఒ.ఎస్. నెం. 1177/2018 ద్వారా ఎల్‌బి.నగర్‌వద్ద గౌరవనీయ III అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి, రంగారెడ్డి జిల్లావారి సమక్షంలో ఒక దావాను దాఖలు చేశారు.

సదరు దావా 31-7-2018 తేదీనాటి స్పెసిఫిక్ పెర్ఫార్మెన్స్ ఆఫ్ ది అగ్రిమెంట్ ఆఫ్ సేల్‌కు చెందినది. సదరు అగ్రిమెంట్ పాక్షిక అమ్మకం ప్రతిఫలం స్వీకరించిన మరియు 5-8-2018 న రిసీట్ కమ్ అడ్వాన్స్‌ను జారీ చేసిన డా. ఆర్.హైమవతి (తన ఎస్‌పిఎ హోల్డరుచే ప్రాతినిధ్యం వహించబడుచున్నారు) చే కుదుర్చుకోబడినది. నిర్దేశించిన ప్లెయింట్ షెడ్యూలు ఆస్తి కొరకు నా క్లయింటు లేదా తన నామినీ పేరిట రిజిస్టర్డు సేలడీడ్‌ను నిర్వహించాలని సదరు దావా కోరుతున్నది.మిగతా అమ్మకం ప్రతిఫలం అందిన 45 రోజుల్లోగా సదరు ఆస్తికి సంబంధించి రిజిస్టర్డు సేలడీడ్ నిర్వహణను కోరుతూ సదరు విషయం గౌరవనీయ న్యాయస్థానం సమక్షంలో అపరిష్కృతంగా ఉన్నది.

ఆస్తి షెడ్యూలు

రంగారెడ్డి జిల్లా, రాజేంద్రనగర్ మండలం, మైలార్‌దేవ్‌పల్లి గ్రామం, టిఎన్‌జిఓస్ కాలనీవద్ద సర్వే నెం.156/1/2లో మొత్తం 900 చ.గ. విస్తీర్ణంతో ఒక్కో ప్లాట్ విస్తీర్ణం 300 చ.గ.గల ప్లాట్ నెం.లు 102, 111 మరియు 225 యావత్తు. ప్లాట్ నెం.102కు సరిహద్దులు: ఉత్తరం: ప్లాట్ నెం.111, దక్షిణం: 60 అడుగుల వెడల్పు గల రోడ్డు, తూర్పు: 40 అ. వెడల్పుగల రోడ్డు, పడమర: ప్లాట్ నెం.103.ప్లాట్ నెం.111కు సరిహద్దులు: ఉత్తరం: 40 అ. వెడల్పుగల రోడ్డు, దక్షిణం: ప్లాట్ నెం.102, తూర్పు: 40 అ. వెడల్పుగల రోడ్డు, పడమర: ప్లాట్ నెం.110.ప్లాట్ నెం.225కు సరిహద్దులు: ఉత్తరం: ప్లాట్ నెం.లు 224 మరియు 244, దక్షిణం: ప్లాట్ నెం.226, తూర్పు: ప్లాట్ నెం.లు 242, పడమర: 60 అ. వెడల్పుగల రోడ్డు.అందువలన సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా పైనతెలిపిన ప్లెయింట్ షెడ్యూలు ఆస్తులకు సంబంధించి ఎట్టి వ్యవహారాలు కుదుర్చుకోరాదు. విక్రయ ఒప్పందాలు లేదా రిసీట్స్ కమ్ అడ్వాన్స్ సహా ఈ ఆస్తుల ఏదేని తదుపరి అన్యాక్రాంతం వలన ఎవరేని వ్యక్తికి సదరు ఆస్తులపై ఎట్టి టైటిల్ లేదా ప్రయోజనం సంక్రమించదు. సదరు వ్యవహారాలు నా క్లయింటును కట్టడీ చేయజాలవు మరియు చట్ట ప్రకారం చెల్లనివి మరియు రద్దయినవిగా భావించబడును.

ఇట్టి విషయాని గ్రహించి, సాధారణ ప్రజానీకం ఏ విధమైన క్రయవిక్రయాలు, ఎటువంటి ఒప్పందాలు చేసుకున్న చెల్లవని గ్రహించగలరు అంతేగాక నా క్లయింట్ తీసుకోబోయే చట్టపరమైన చర్యలు బాధ్యులు కాగలరు.

సం/- యస్ .పి. లా. కన్సల్టెన్సీ
పెండేట శ్రీనివాస్, జె.సుజాత, ఎ.రాజేశ్వరి, అడ్వొకేట్స్,
షాప్ నెం.31, గ్రౌండ్ ఫ్లోర్, రజనీగంధ కాంప్లెక్స్, హెచ్‌డిఎఫ్‌సి ప్రక్కన, చైతన్యపురి, దిల్‌సుఖ్ నగర్, హైదరాబాద్- 500060,
ఫోన్ నెం.లు 9391046702, 9618218668.